# బాలకాండ

జివ్వుమంటూ వీస్తున్న గాలికి నేను దగ్గరగా ముడుచుకొనడం గమనించి సరస్వతి కిటికీ రెక్కలు మూసి "ఇక నిద్ర పోరాదూ" అంది దీపం వెలుతురికి కళ్ళు చిట్లిస్తూ.

"ఇదిగో కాసేపట్లో పూర్తయిపోతుంది ఉత్తరం."

ఆమె వెళ్ళి నడుం వాల్చింది.

పక్కవాటాలో ఆయన అప్పుడే భోజనం చేసినట్టున్నారు, త్రేనుస్తూ అలమారా తలుపులు తెరుస్తున్నాడు. భోజనానంతరం ఆయనకి నమలటానికి ఏదో ఒకటి అవసరం. ఏమీ లేకపోతే ఆ యిల్లాలు నాలుగు కందిబద్ద లయినా వేయించి ఓ సీసాలో పోస్తుంది. అవి ఆయన ఆప్యాయంగా ఆరగిస్తాడు. ఆయన కందిబద్దల్ని పటపటా నముల్తున్నాడు.

సరస్వతి చప్పున ఇటు తిరిగి "మొదలెట్టాడు పటపటా చప్పుడు చేసుకుంటూ" అంది విసుగ్గా.

ప్రతి రాత్రి ఇది మామూలు. ఆయన ఆఫీసు వదలగానే నేరుగా యింటికి వచ్చేస్తారు. ఆమె చక్కగా ముస్తాబై ఆయన రాకకోసం ఎదురుచూస్తూ వుంటుంది. ఆయన రాగానే దంపతులిద్దరూ కలిసి సినిమాకో, నాటకానికో, స్నేహితులిళ్ళకో పోయివస్తూంటారు. అప్పుడప్పుడు బాగా పొద్దుపోయి

గాని ఇంటికి చేరుకోరు. ఒకవేళ యింట్లోవున్నా ఆ కబుర్లూ ఈ కబుర్లూ చెప్పుకుంటూ ఒకళ్ళని ఒకళ్ళు కవ్వించుకుంటూ రాత్రి పొద్దుపోయి ఇరుగూ పొరుగూ సద్దుమణిగాకగాని భోజనాలు చెయ్యరు. పిల్లా జల్లా ఇంకా బయల్దేరలేదు గనక బాదరబందీ లేదు.

సరస్వతికి కొంచం కోపం ఎక్కువ. ముఖం ముటముట లాడుతూంటుంది ఏమాత్రం అసంతృప్తి కలిగినా. అవతల వాటాలో గిన్నెలు సర్దుతున్న చప్పుడు వినగానే నేను ముందు గడియారంవంక చూసి ఆ తర్వాత సరస్వతివైపు చూసాను. ఆమె చీర చెరగు చెవులమీదకంటా కప్పుకుని "అర్ధరాత్రివేళ అంకమ్మ శివాలు" అంటూ గొణుక్కుంది.

నా ఉత్తరం పూర్తయింది.

పక్కింటావిడ ఇల్లు కడుగుతూంది.

"ఉన్న దిద్దరూ, ఊరంత అల్లరీ—" సరస్వతి గొణుక్కుంది.

నేను "హుష్" అంటూ వారించబోయేను.

పక్కింటాయన మరోమారు సుదీర్ఘమైన తేన్పు త్రేన్చి తేలిక పడ్డటుగా "హామ్మయ్యా" అనుకున్నారు.

సరస్వతి ఒక్క అదటునలేచి కూర్చుని "ఒంటరిగా ఉండే వాటా ఏదయినా చూడండి, పోదాం బాబూ" అంది.

ఉత్తరం మడిచి కవరులో పెడుతూ "చూదాం" అన్నాను.

ఆమె గ్రహించి "చూదామని అంటే కాదు. చూడాలి" అంది.

"కారణం?"

"మళ్ళీ మొదలా?"

"చెబుదూ?"

"ఈ ఇల్లు ఏమీ బాగాలేదు."

"అది నమ్మతగిన కారణం కాదు."

సరస్వతి ముఖం ముడుచుకుని "ఇంతకంటె మంచి వాటా ఉంటాయి" అంది.

"ఉండవచ్చు. అది వేరు విషయం. మంచికి అంతెక్కడ? విత్తంకొద్దీ వైభవం అన్నారు పెద్దలు."

ఇక ఆమె ఉండబట్టలేక, నేను దీపం ఆర్పి పండుకోబోతుంటే "ఈ అర్ధరాత్రి గొడవలు, చిలిపితనాలు భరించలేనండీ" అంది. ఆమె యిప్పుడు అసలు విషయానికి దగ్గరగా వస్తోంది.

"ఇది తప్పకుండా నమ్ముతా" అన్నాం.

ఆమె తను బయటపడి పోతున్నానని తెలుసుకుంది కాబోలు "అబ్బే అదికాదండీ, అసలు మాట వరసకు అంటున్నాను" అంది.

పెద్దపిల్లలు ముగ్గురూ మంచానికి అడ్డంగా పడుకుని నిద్రపోతున్నారు. చంటి పిల్లవాడు తల్లిపక్కన పడుకున్నాడు. పుట్టిపోయినవాళ్ళుపోగా మిగిలిన సంతానంకూడా ఆరోగ్యం విషయంలో అంతంతమాత్రంగానే పెరుగుతున్నారు. రెండోవాడ్ని

పెంచుకుంటానని ఒకరిద్దరు దగ్గరవాళ్ళే అడిగించారు; అడిగారు కూడాను. నా కభ్యంతరం లేదన్నాను. సరస్వతి మాడు పూటలు పస్తుపడుకుంది. నా వాడు నా దగ్గరే వుండిపోయాడు. వున్న వాళ్ళందరిలోకీ వాడే కొద్ది ఎరుపుగా పుష్టిగా వుంటాడు.

"ఇంకా ఏమిటి ఆలోచిస్తున్నారు పడుకోక" అంది సరస్వతి.

ఆ హెచ్చరిక అర్థం "రాత్రంతా అడపా తడపా ఎలాగూ మెలుకువరాక తప్పదు. పిల్లలు ప్రశాంతంగా నిద్రపోతున్నప్పుడే మనమూ ఓ కునుకు తియ్యటం మంచిది" అని.

నేను కన్నుమూసానో లేదో ఉయ్యాలలో చంటివాడు గొంతుకెత్తాడు. సరస్వతి లేచి సముదాయించే లోపల వాడితో పాటు మూడోవాడూ కెవ్వుమన్నాడు. మిగతావాళ్ళు లేవకుండా ఇద్దరు చెరొకర్నీ చంకన వేసుకుని వరండాలోకి తీసుకుపోయాం. కొద్దిసేపు అటూ యిటూతిప్పి కబుర్లు చెబితేగాని మళ్ళీ వాళ్ళు నిద్రపోరు. వాళ్ళని నిద్రపుచ్చి యథాస్థానాల్లో పడుకోబెట్టి మేం నడుములు వాల్చేసరికి ప్రాణాం అతలా కుతలం అయిపోయింది.

పక్క వాటాలోంచి ఇంకా మాటలు వినవస్తూనే వున్నాయి.

"ఇవాళ రికామీగా రింగు రిటుకుమంటూ మెలగానే సరికాదు. ఆడదై పుట్టిం తర్వాత పిల్లల్ని కనకా తప్పదు, మంచో చెడో వాళ్ళతో తిప్పలు పడకా తప్పదు. ఆ జ్ఞానం లేక పూరికే మిడిసి పడుతుంటాం" అంది సరస్వతి.

నేను కంగారుగా "ఏవిటా మాటలు? ఒళ్ళు తెలిసే అంటున్నావా?" అంటూ వారించాను.

ఆమె వెంటనే బదులు చెప్పలేదు. తర్వాత ఏదో అస్పష్టంగా గొణుక్కుంది. చీర చెరగు ముఖంమీదకు విసురుగా కప్పుకుంది. అటూ ఇటూ ఒణుకుతున్నట్టుగా కదిలింది. ఏవిటీ మనిషి?

"అలా అనవసరంగా వాళ్ళనీ వీళ్ళనీ ఆడిపోసుకోబోతే ఆ మంచం వెయ్యరాదూ? పిల్లలు నుక్కలో పడుకోలేక ఏడుస్తున్నారు. ఆ చాపలు రెండూ చిరిగిపోతున్నాయి. అంచులు గుడ్డల పీలికలతో కుట్టమని చెప్పానా? ఆపని చేసావూ? కాస్తంత తీరిక దొరికే సరికల్లా ఇరుగమ్మా పొరుగమ్మా వూసేనా?" అని నేను సానునయంగా చెప్తూ కొస్తుంటే___

"కాకపోతే ఏవిటండీ? రాత్రిళ్ళు సుఖంగా నిద్రపట్టటం లేదంటూ ఆవిడ పనిమనిషితో చెప్పటం నేను విన్నాను. దానర్థం ఏవిటి?"

"దానర్థం మన పిల్లల ఏడుపు మూలకంగా వాళ్ళకి నిద్ర చెడిపోతోందని ఎక్కడుంది?"

"మీకు అర్థంకాదు లెద్దురూ. ఆవిడగారి ధోరణి నేను కనిపెడుతూనే వున్నా" అనేసి సరస్వతి గోడకి అభిముఖంగా తిరిగింది.

* * *

ఆఫీసులో తెమలక పేరుకుపోయిన కాగితాల్ని ఇంటికి తెచ్చుకొని రాసుకుందామంటే ఎవరో చెప్పి పెట్టినట్టుగా. సినిమాల్లో సంఘటనలాడున్న నలుగురులోనూ ఎవడో ఒకడు బాగా ఎత్తేస్తాడు. ఒక్కొక్కప్పుడు ఇద్దరూ కాసీ, మరో కప్పుడు ముగ్గురూ కానికూడా జంటగాత్రం వినిపిస్తూంటారు. అటువంటప్పుడు నేను చెయ్యగలిగింది, చేస్తూ చేస్తూన్న పని ఆపుచేసి రెండు చేతులతోనూ చెవులు మూసుకొని గోడకి చేరబడిపోవటం. మరిక చెయ్యగలిగిందేమీలేదు ఏడ్చే పిల్లల్ని కొడితే మరింత ఏడవక ఊరుకుంటారా? అలాగని అంటే ఆమె వూరుకుంటుందా? లాభం లేదు.

పక్కవాటాలో ఆయన పిల్లల సాహిత్యంలో కృషి చేస్తూంటారు. పిల్లల పాటలు ఆయన విరివిగా రాస్తూంటారు. సాయంత్రం ఆఫీసునుంచి ఇంటికి రాగానే ఇల్లాల్ని పక్కనే కూర్చోబెట్టుకొని, ఆఫీసుకు వెళ్ళేటప్పుడూ, మళ్ళీ తిరిగి వచ్చేటప్పుడూ రేగిన భావాలని, అరగంట విశ్రాంతి సమయంలో కాంటీన్‌లో కూచుని రాసిన పాటల్ని వినిపిస్తుంటాడు. పాట పేరు బంగారు పిచ్చుకట!

"పాపా పాపా! ఓహోహో పాపా! ఆహా పాపా!

దభీ దభీమంటూ వంట గదిలోంచి గుద్దులు వినిపించి ఆ వెనుక వెంటనే మూడో వాడు వాళ్ళు జలదరించేలా పిచ్చి కేకలు వెయ్యటం చెవులసొకి క్షణం జ్ఞానేంద్రియాన్ని పక్క వాటాలో దంపతులమీద లగ్నం చేసాను.

మిగతా పాట రాత్రి వినిపిస్తానుగాని అలా బయటికి షికారు పోదాం పద" అంటున్నాడాయన. కుర్చీ కిర్రుమంది.

అడుగులు లోపలికి వెళ్తున్న చప్పుడు... అయిదు నిమిషాల తర్వాత జోళ్ళ టకటకలూ తలుపు గొళ్ళెం చప్పుడూ... సరస్వతి బయటికి భద్రకాళిలావచ్చి చుట్టూ దస్త్రాలు పరుచుకున్న నన్ను వురిమి చూసింది. ఆమె చూపుల్నించి తప్పించుకుని నేను ఫైలులోంచి కాగితాలు బయటకుతీసి చదువుతూ కూర్చున్నాను. పక్కవాటాలో దంపతులు కిళ్ళీలు నములుతూ కిలకిల నవ్వుకుంటూ బయటి కొచ్చారు. ఆయన బెంగాలీబాబులాగా ఆవిడ కాలేజీ అమ్మాయికి మల్లేనూ ముస్తాబయారు. ఎత్తయిన మడమల జోళ్ళు తొడుక్కుని నడవటం ఆమెకు బాగా అలవాటయిపోయింది.

ఆమెదృష్టి నావైపు మళ్ళించింది. విసురుగా లోపలికి వెళ్ళబోయిందల్లా ఆగి వరండా చివరికంటా వెళ్ళి ఆ దంపతుల్ని సందు మలుపు తిరిగే వరకూచూసి "చూసారా ఆ తీరు" అన్నట్టుగా చూసింది నావైపు.

పెద్ద ఆశ్చర్యం లేనట్టుగా నేను మాట్లాడకుండా వూరుకున్నాను.

సరస్వతి గడప కానుకుని కూర్చుని "ఆమెకు నా వయస్సుంటుంది కదండి" అంది.

"అవును ఆయనా నేనూ ఒకే ఈడువాళ్ళం."

"ఏమిటా పిచ్చివేషాలు! వెర్రి మొర్రిగా వుంటాయి కదూ?"

"ఎవరి ఇష్టాలు వారి కుంటాయి."

"ఆపాటి అందరికీ తెలుసు లెద్దురూ. అసలు మీ మగవాళ్ళంతా ఇంతే. ఆడదంటే అలాగే వుండాలని మనసులో ఏదో వుంటుంది. పైకి మటుకు మరోలా... ఇంతెందుకు సినిమాకి తీసుకెళ్ళి ఎన్నాళ్ళయింది చెప్పండి... నేను చెబుతున్నది అది కాదండీ... ఒకవేళ సినిమాకి వెళ్ళటం తప్పని మీరనుకుంటే ఎవరు వెళ్ళినా తప్పేగదా? పక్కింటావిడ వాళ్ళాయన్ని పదిమార్లు బ్రతిమిలాడాల్సిన అవసరం లేకుండానే వారం వారం ఇద్దరూ సినిమాకి పోతూంటారు. అది మరీ విపరీతం. నెలకోమారు చాలంటాను. ఆవిడ వారం వారం వెళ్ళటం బాగులేదని నేనంటే నన్నుమీరు ఖండిస్తారు దేనికి?

"సర్లెద్దూ. లోపలికిపోయి పని చూసుకో."

"అంతేలెండి. లోపలికిపోయి ఆ పొగలో అలా చచ్చిపో" అంటారుగాని ఒక్కమారు ఏ సినిమాకో, నాటకానికో పోదాంపద మంటారూ?"

నేను సమాధానం చెప్పదల్చుకోలేదు. ఆమెను తీసుకుని సినిమాకిపోయి చాలా రోజులయినమాట నిజమే. డబ్బు లేకపోవటమన్నది. ఎప్పుడూ వుండే సమస్యే. అవసర మయినప్పుడల్లా ఎన్నిసార్లు అప్పులు చెయ్యటంలేదు గనక. అసలు విషయం అదికాదు. ఈ పసిపిల్లల్ని తీసుకుని సినిమాకివెళ్ళే చాలా బాధలు వున్నాయి. వాళ్ళకి ఆ వాతావరణం సరిపడదు తిక్కగా వుంటుంది. ఏడుస్తారు. నిద్రపోతారు. నిద్రపోయిన పిల్లల్నిచూస్తే బళ్ళవాళ్ళు రెట్టింపు ఛార్జీలు అడుగుతారు. ఈ అవస్థపడలేక సినిమాలకి వెళ్ళటం మానుకున్నాం.

నిజానికి సరస్వతికూడా ఈ మోజు తగ్గించేసుకుంది. అప్పు డప్పుడు ఇరుగూ పొరుగూ సమవయస్కులు రిక్షామీద సినిమాలకి పోతూన్నప్పుడు మటుకు ఆమెలో అణగారిపోయిన ఉత్సాహం అనేక రకాలుగా బయటపడుతూంటుంది."

సరస్వతి మళ్ళీ పక్కింటివాళ్ళ ప్రసక్తి తెచ్చింది.

"ఇక నీకు మరో పని లేదా. ఆవిడ నీకేం అపకారం చేసింది" అన్నాను విసుగ్గా.

ఆమెకు మళ్ళీ కోపం వచ్చేసింది. "అంతేలెండి. నేనే మన్నా తప్పుగానే వుంటుంది. అచ్చటా ముచ్చటా అన్నది ఒకళ్ళని చూసయినా నేర్చుకోరేం" అంది. ఆ "ఒకళ్ళు" ఎవరో నాకు తెలియకపోలేదు. ఉదయం భోజనాల దగ్గర ఈ నోటితోనే ఆ ఒకళ్ళని గురించి "మొగుడూ పెళ్ళాం అన్న తర్వాత అనురాగం, అభిమానం వుండవలసిందేగాని మరీ ఇంతచేటు నే నెక్కడా చూడలేదు. కాపరాలు మేమూ చేస్తున్నాం. ఇరవై నాలుగ్గంటలూ రాసుకు పూసుకు తిరు గుతేగాని చూసేవాళ్ళకి వాళ్ళు మొగుడూ పెళ్ళాలని తెలి యదా ఏమిటి?" అంది.

"పిల్లలు కలవాళ్ళు పెద్దవాళ్ళ క్రింద జమ. అంతేకాదు, ఆ పిల్లలు నీనుంచీ నానుంచీ చాలా దోచుకుంటారు. పిల్లలు లేకపోతే పక్కవాటాలో దంపతుల్లా స్వేచ్ఛగా మనమూ వుండొచ్చుకదూ" అన్నాను.

"నే నొప్పుకోను. పిల్లలులేని బ్రతుకూ ఒక బ్రతుకే" అంది సరస్వతి ఆమె హృదయపూర్వకంగానే అంటుందా? అని నాలో ప్రశ్న.

"మరి వాళ్ళలాగా మనం ఉండగలమూ? వాళ్ళకి ఏ బంధనా లేదు."

"ఛీ! అదేం బ్రతుకండి" అంది సరస్వతి ముఖం చెండుకుంటూను.

"ఏంలోటు?"

"ఆ తీపి కన్నమ్మకే తెలుస్తుంది. కన్నకడుపు అని ఊరికే అన్నారా? ఆడదాని జీవితం మాతృత్వంతోనే ధన్యత చెందుతుందని మన పెద్దలంటూ వుంటారు"—సరస్వతి దాపరికం లేకుండా మాట్లాడుతోందని నమ్మాను.

"అయితే మనం వాళ్ళకంటె అదృష్టవంతులం అన్నమాట" అన్నాను.

"నిస్సందేహంగా" అంది దృఢమైనస్వరంతో సరస్వతి.

## 2

పక్కింటాయన పేరు కుటుంబరావుగారు. ఆయన ఎక్కువగా మాట్లాడే మనిషి కాదు. ఆ ఎక్కువగా మాట్లాడక పోవటమన్నది ఇతరులతోనేగాని ఇంటి ఇల్లాలితో మటుకు కాదని, ఆవిడ దగ్గరమటుకు వాగేనోరు వాగినట్లే వుంటుందని సరస్వతి వ్యాఖ్యానం. అది పూర్తిగా కాకపోయినా కొంత వరకూ నిజం. ఒక వేళ ఆయన నాతో మాట్లాడవలసి వచ్చినా ఎంత తొందరగా తెముల్చుకుందామా అనే ధోరణిలోనే ఉంటాడాయన. ఇవాళ ఆయనే స్వయంగా నాదగ్గరకొచ్చి "మీతో ఒక విషయం మాట్లాడాలి" అన్నాడు. సమాధానం కోసం ఎదురుచూడకుండానే కుర్చీలో కూర్చుని "స్కూలుకి దగ్గర్లో ఓ డాబా ఇల్లు ఖాళీ అయింది. మొత్తం ఏభయి

రూపాయలు అద్దె ఇక్కడ ఇద్దరం కలిసి అరవై యిస్తున్నాం చెరి అయిదూ లాభం వుంటుంది. అక్కడికి మారదామా?" అన్నాడాయన ఏకబిగిని.

"ఇల్లు ఇంతకంటె బాగుందేవిఁటి?"

"వెయ్యిరెట్లు నయం. స్కూలుకి దగ్గరలోనే... అదే నండీ పంపులేదు, ఆ పక్కసందు మొదటి మేడేనండీ."

నేను జ్ఞాపకం చేసుకుందుకు ప్రయత్నిస్తుంటే.

"ఇంకా మీకు గుర్తుకు రాలేదూ... అదే మొన్న హత్య జరగ లేదూ."

"హాఁ!!!"

"అహఁ... ఆ యిల్లు కాదులెండి. దాని పక్కయిల్లు"

వంటగదిలో గిన్నెకిందపడి గింగురుమంటూ మ్రోగింది.

"ఆలోచించి చెబుతానులెండి"

ఆయన వెళ్ళిపోయాడు. నుదుటిమీద చెమట ఒత్తుకుంటూ ఈవిషయం సరస్వతితో చెప్పి ప్రయోజనం ఉంటుందా అని ఆలోచిస్తున్నా. సరస్వతి ఎలాగూ ఇందుకు ఒప్పుకోదు. అది ఖచ్చితం.

భోజనాలదగ్గర కదిపాను. ఇటీవల అయిదారు రోజుల్నుంచీ సరస్వతి పక్కవాళ్ళగురించి మాట్లాడటం మానేసింది.

"అయిదు రూపాయలు తగ్గి ఇంతకంటె బాగున్నప్పుడు వెళ్తే ఏం?" అంది సరస్వతి.

నేను ఆశ్చర్యపోయాను. ఈ మార్పు నాకు అర్థం కాలేదు "ఒక చెంప వాళ్ళతో పొత్తు బాగుండలేదంటూ మళ్ళీ వాళ్ళతోనే ఉండటమా? ఎందుకొచ్చిన బాధ. హాయిగా మనం ఇక్కడే ఉందాం. వాళ్ళు ఖాళీచేస్తే గంపెడు పిల్లలు

గలవాళ్ళు ఆ వాటాలోకి వస్తే మనం వాళ్ళం కలిసిపోవచ్చు. ఈ అడ్డుగోడ తలుపుల్ని తెరిచేద్దాం."

"అంతగా మీరు వద్దంటే కాదనను గాని వెళ్ళటానికి నాకేమీ అభ్యంతరం లేదండీ" అంది సరస్వతి.

"నువ్వు గడియకోమాట అంటావు"

"ఏదో అనివుంటా ననుకోండి. అనేకం అనుకుంటూ వుంటాం, అదే ఎల్లకాలం మనసులో పెట్టుకూర్చుంటామా ఏమిటి?" అంది సరస్వతి.

ఆమెని ఎలా అర్థం చేసుకోవాలో నాకు బోధపడటం లేదు.

* * *

రాత్రి పక్కలువేస్తూ "అయింది సంబరం" అంది సరస్వతి ఉన్నట్టుండి.

"ఏమిటది?"

"ఆవిడకు నెల తప్పింది."

సరస్వతి ముఖంలో ఏ భావమూ నాకు కనిపించలేదు.

మంచంమీద కూర్చుని అరికాళ్ళు దులుపుకుంటూ "ఆమెకూడా ధన్యురాలయిందన్నమాట" అన్నాను.

సరస్వతి చాపమీద పడుకుని నిద్రపోతున్న పిల్లవాడ్ని మంచంమీద పడుకోబెట్టి విసురుగా చేతులు వూపుతూ "ఆc! ధన్యత కాదుగాని జీవితం నరకం కాకుండావుంటే అదే పదివేలు. పిల్లల్ని కనగానే సంబరంకాదు. ధన్యతట, ధన్యత" అంది వెక్కిరింపు ధోరణిలో.

A woman who doesn't know her own mind